సాక్షి పల్నాడు

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం 2024 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.



మల్లెతోటలు పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని హౌస్‌గణేష్ గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పరిశోధనాస్థానం గుంటూరు లాంఫాం శాస్త్రవేత్తలు మల్లెతోటలు పరిశీలించారు.



బియ్యం పంపిణీ తనిఖీ

తెనాలి: జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ గురువారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్ల వాహనాలను తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

61.42 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మొదలైంది. గురువారం రాత్రి 6.25 గంటలకు 61.42శాతం పూర్తయినట్లు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 2,84,006 మందికి రూ.84.82కోట్లు పంపిణీ చేయాల్సివుండగా 1,74,384మందికి రూ.52.09కోట్ల పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే సచివాలయ సంక్షేమ సెక్రటరీలు, ఆయా ప్రాంతాల వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి సామాజిక భద్రతా పింఛన్లు అందజేశారు.

రేపు మినీ జాబ్ మేళా

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం గుంటూరు కలెక్టరేట్ రోడ్డులో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాల జిల్లా కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి కె.రఘు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిసర ప్రాంతాలలో ఉన్న యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. జాబ్‌మేళాలలో ఎల్ఐసీ, పేటీఎం సంస్థలు ప్రత్యేకంగా హాజరవుతాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 19–35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు వారి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9652065235 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 1,24,034 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,24,034 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,20,528 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,912 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

బీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి

టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఘన చరిత్ర కలిగిన బీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తున్నామని టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్‌తో కలిసి ప్రద్యుమ్న స్టేడియంను పరిశీలించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రికెట్ స్టేడియం, బౌండరీ వాల్‌తోపాటు 400 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టేడియం అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతోపాటు బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి ప్రద్యుమ్నను కోరారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,510, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 821.90 అడుగుల వద్ద ఉంది.



నరసరావుపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



క్రోసూరులో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, కార్యకర్తలు



వినుకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పిడుగురాళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

సామాజిక న్యాయానికి జేజేలు

- బలహీనవర్గాల అభ్యర్థిని పోటీలో నిలిపిన సీఎం వైఎస్ జగన్
- పార్లమెంటు సమన్వయకర్తగా అనిల్ యాదవ్‌ను స్వాగతిస్తున్నాం
- పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపు
- రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి

సమన్వయకర్తగా అనిల్‌కుమార్ యాదవ్ నియామకంపై ఎమ్మెల్యేల హర్షం

నరసరావుపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారని, దానికి రుజువే వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమించారని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమని అనిల్‌కుమార్ నియామకం ద్వారా మరోసారి చాటారన్నారు. ఈమేరకు గురువారం పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేస్తున్న సీఎం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గంలోని ఆరుగురు ఎమ్మెల్యేలు, ఒక సమన్వయకర్త స్వాగతిస్తున్నాం. అనిల్‌కుమార్ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి చాలా చురుగ్గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారు.

నరసరావుపేట పార్లమెంటు స్థానం నుంచి నెల్లూరు వాసులు పోటీచేయటం కొత్తేమీకాదు. గతంలో దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధనరెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహనరెడ్డి పోటీచేసి గెలిచారు. ఇప్పుడు కూడా అనిల్‌కుమార్ యాదవ్ బ్రహ్మాండమైన మెజార్టీతో విజయం సాధించేందుకు మేమంతా కష్టపడి పనిచేస్తాం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం సీఎం వైఎస్ జగన్ కృషిచేస్తూ ఈ స్థానం నుంచి బీసీ అభ్యర్థిని పోటీలో నిలబెట్టారు. దీనిని బీసీ వర్గీయులు అందరూ హర్షిస్తున్నారు. ఈనెలలో అనిల్‌కుమార్‌యాదవ్ నియోజకవర్గానికి వస్తారు. ఆయనకు బ్రహ్మాండమైన ఘనస్వాగతం ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్యే, నరసరావుపేట



అనిల్ కుమార్ యాదవ్

విజయఢంకా మోగిస్తాం

క్రోసూరు: నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయర్తగా బలహీన వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమించడంపై పెదకూరపాడు నియోజకవర్గవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యతిస్తున్న వైనంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ దఫా సైతం పార్లమెంట్ నియోజకవర్గంలోనూ, జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడించేందుకు, రెండోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఆయా వర్గాల వారు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. తప్పకుండా విజయఢంకా మోగిస్తాం.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే, పెదకూరపాడు

బీసీలకు సముచిత స్థానం

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సరావుపేట ఎంపీ స్థానం బీసీ వర్గాలకు కేటాయించడాన్ని అన్నివర్గాలు స్వాగతిస్తున్నాయి. పార్లమెంట్ పరిధిలోని ఏడు ఎమ్మెల్యే స్థానాలతోపాటు ఎంపీ స్థానాన్ని సైతం అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ అనిల్‌కుమార్ యాదవ్ అభ్యర్థిత్వంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎన్నడూ ఎంపీ స్థానం బీసీలకు ఇవ్వలేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు వారిపై కపటప్రేమ చూపిస్తున్నారు. ఆయన మాటలు జనం నమ్మరు. సీఎం వైఎస్ జగన్ సాహసోపేత నిర్ణయంతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

– బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

రాజకీయాల్లో పెనుమార్పు

పిడుగురాళ్ల: సామాన్యుడు సైతం ఢిల్లీలో గళం వినిపించేందుకు నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించటం రాజకీయాల్లో పెనుమార్పు. మొట్టమొదటిసారి నర్సరావుపేట పార్లమెంట్‌కు ఓ బీసీ అభ్యర్థిని ప్రకటించడం విప్లవాత్మకం. రాబోయే రోజుల్లో నర్సరావుపేట పార్లమెంట్ పరిధిలో జరిగిన అభివృద్ధి, సామాజిక న్యాయం, సంక్షేమంపై సర్వత్రా చర్చ జరుగుతుంది. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసి, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకుంటాం. రాబోయే రోజుల్లో పల్నాడు వాణిని అనిల్‌యాదవ్ పార్లమెంట్‌లో బలంగా వినిపించనున్నారు.

– కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, గురజాల

పల్లెకు ఆర్థిక దన్ను

జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.47.25 కోట్లు విడుదల



సత్తెనపల్లి: జిల్లాలోని గ్రామపంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రామాల రూపురేఖలను మార్చేందుకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఈ నిధులను సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నారు. గ్రామ పంచాయతీలో కొత్తపాలన వచ్చి మూడేళ్లయిన సందర్భంగా జిల్లాలో గ్రామ సర్పంచ్ పాలన ఉన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడత బేసిక్ గ్రాంట్ కింద రూ. 3,87,22,744, టైడ్ గ్రాంట్ కింద రూ.13,89,81,539, మొత్తం రూ.17,77,04,283 కేటాయించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత బేసిక్ గ్రాంట్ కింద రూ.11,72,93,081, టైడ్‌గ్రాంట్ కింద రూ.17,75,29,578, మొత్తం రూ.29,48,22,659 కేటాయించారు. దీంతో మొదటి విడత, రెండో విడత, వడ్డీ తాలూకు మొత్తం రూ.47,25,26,942 అన్ని గ్రామ పంచాయతీ ఖాతాలకు జమయ్యాయి.

నిధులు సక్రమంగా వినియోగించుకోవాలి

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి. గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలి.

– ఎంవీ భాస్కరరెడ్డి, డీపీఓ, పల్నాడు జిల్లా

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- చిరుమామిళ్లలో రూ.6 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ




చిరుమామిళ్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో మల్లెల

నాదెండ్ల: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, అనారోగ్యంతో ఏ ఒక్క కుటుంబం అప్పులపాలు కాకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందజేస్తోందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిరుమామిళ్ల గ్రామంలో దాత నడికట్టు రామిరెడ్డి అందించిన 2.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.6కోట్ల నాబార్డు నిధులతో 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. సభకు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు అధ్యక్షత వహించారు. తొలుత పార్టీ చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడుతో కలిసి గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొడ్డా బాలకోటిరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో పంచాయతీరాజ్‌శాఖ నిధులతో ఏర్పాటు చేసిన రచ్చబండను ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

రూ.17వేల కోట్లతో ఆస్పత్రుల ఆధునికీకరణ..

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణంతో చుట్టుపక్కల గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా రూ.17 వేల కోట్ల నిధులను ఆసుపత్రుల ఆధునికీకరణకు ఖర్చు చేసిందన్నారు. చిలకలూరిపేటలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, రూ.8500 కోట్లతో నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపథకం ద్వారా గ్రామాల్లోనే మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు అందించి అవసరమైన వారికి ఏరియా ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించేందుకు అవకాశం కలిగిందన్నారు. గ్రామంలో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. పార్టీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వాసుపత్రుల ద్వారా పేదలకు నాణ్యమైన మెరుగైన ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత, ఉప సర్పంచ్ మేకల హనుమాయమ్మ, ఎంపీటీసీ సునీత, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, ఏడుకొండలు, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ అహమ్మద్, నాదెండ్ల సొసైటీ సీఈఓ అంజయ్య, వైద్యఆరోగ్య శాఖ ఎస్ఈ వి.చిట్టిబాబు, డీసీహెచ్ఎస్ రంగారావు, ఈఈ శ్రీధర్‌ప్రసాద్, డీఈ హనుమంతరావునాయక్, ఏఈ ధనుంజయరావు, పార్టీ నాయకులు అల్లడి రవికుమార్, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, సింగారెడ్డి కోటిరెడ్డి, గద్దె కోటేశ్వరరావు, జెట్టి లక్ష్మీనారాయణ, కోయలమూడి సాంబశివరావు, కాట్రగడ్డ రామకృష్ణ, బత్తుల సీతారామిరెడ్డి, చందవరం వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలీ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ



నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

నగరంపాలెం: ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 102 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. గుంటూరు దిశ ఉమెన్ పీఎస్ డీఎస్పీ కేసన చెంచురామారావుని కొవ్వూరు డీఎస్పీగా, తూర్పుగోదావరి క్రైం డీఎస్పీ జి.సి.గురునాథ్‌బాబుని పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా, రాజమండ్రి ఈజీ/కొవ్వూరు డీఎస్పీ వి.ఎస్.ఎన్.వర్మను పల్నాడు జిల్లా నరసరావుపేటకు, పల్నాడు జిల్లా దిశ ఉమెన్ డీఎస్పీ యు.రవిచంద్రను జగ్గారెడ్డిగూడెంకు, ఒంగోలు పీటీసీ డీఎస్పీ ఎం.సుధాకరరావుని పల్నాడు జిల్లా దిశ ఉమెన్ పీఎస్‌కు, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ వెస్ట్ డివిజన్ డీఎస్పీ సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా, మైలవరం డీఎస్పీ ఎం.రమేష్‌ను గుంటూరు సీసీఎస్‌కు, గుంటూరు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబును మచిలీపట్నం డీఎస్పీగా, తుళ్లూరు డీఎస్పీ వి.పోతురాజును గుంటూరు ఎస్‌బీకి, గుంటూరు పశ్చిమ డీఎస్పీ బి.ఉమమహేశ్వరరెడ్డిని శ్రీకాళహస్తి డీఎస్పీగా, పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను ఈస్ట్ గోదావరి దిశ ఉమెన్ పీఎస్‌కు, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావుని మార్కాపురం డీఎస్పీగా, గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాష్‌బాబును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ దిశ డీఎస్పీగా, గుంటూరు ఎస్‌బీ తుపాకుల వెంకట రత్నస్వామిని ప్రకాశం దిశ ఉమెన్ డీఎస్పీగా, గుంటూరు ఎస్సీ/ఎస్టీ సెల్ డీఎస్పీ ఎస్.విజయ శేఖర్‌ను ఏసీబీ డీఎస్పీగా, పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్‌ను గుంటూరు పశ్చిమ ఏసీపీగా, ప్రకాశం జిల్లా దిశ పీఎస్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల జిల్లా క్రైం డీఎస్పీగా, బాపట్ల జిల్లా క్రైం డీఎస్పీ కె.నాగేశ్వరరావును ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఉప్పొంగిన ఉత్సాహం

- వైభవంగా తిరుపతమ్మ రంగుల మహోత్సవం



ఉత్సవానికి బయలుదేరిన విగ్రహాల వద్ద ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి రంగుల మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. రెండేళ్లకొకసారి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5.54 గంటలకు వేద పండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్చరణల మధ్య మహా నివేదన అనంతరం శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వాముల ఉత్సవమూర్తులు సహదేవతలు మల్లమ్మ, చంద్రయ్యలు, శ్రీఅంకమ్మ, పెద్దమ్మలు, మద్దిరావమ్మ, వున్నవూరు అంకమ్మ, గుర్రం వాహనాలను ఆలయం నుంచి ఈవో కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సతీమణి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో సాయిహర్ష, , పాలకవర్గ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆలయం నుంచి వెలుపలకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు విగ్రహాలు రంగుల మండపం వద్దకు చేరుకున్నాయి.

అమృత్ భారత్ స్టేషన్ల పనులు వేగవంతం

- రూ.225 కోట్లతో ఆధునికీకరణ
- ఈ ఏడాది జూన్‌లోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- విలేకరుల సమావేశంలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ



మాట్లాడుతున్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ, పక్కన ఏడీఆర్ఎం శ్రీనివాస్

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంజూరు చేసిన అమృత్ భారత్ స్టేషన్‌లను అత్యాధునికరణ పద్ధతిలో రూపొందేందుకు సిద్ధం అవుతున్నాయని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలో డీఆర్ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కేంద్ర రైల్వే బడ్జెట్‌పై సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్‌లుగా సిద్ధం చేసేందుకు కేంద్ర రైల్వేశాఖ ఆమోదం తెలిపిందన్నారు. గుంటూరు, రేపల్లె, నంద్యాల, మంగళగిరి, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, నడికుడి జంక్షన్, వినుకొండ, ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ, మాచర్ల, దొనకొండ స్టేషన్‌ల అభివృద్ధికి రూ.225 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది జూన్‌లోగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ 16 స్టేషన్‌లలో ప్రధానంగా ఏడు రైల్వే స్టేషన్‌లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేయనున్నామన్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం ఫుడ్ ప్లాజాలను ఏర్పా టు చేస్తున్నామన్నారు. కొన్ని స్టేషన్‌లకు మాస్టర్ ప్లాన్‌లను పూర్తి చేశామన్నారు. ఈ స్టేషన్‌లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు నూతన ఆధునిక పద్ధతిలో సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర రైల్వే శాఖ గుంటూరు డివిజన్‌లో మంజూరు చేసిన అమృత్ భారత్ స్టేషన్ పనులను పూర్తి చేయడంతోపాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు డివిజన్ పేరు ప్రథమ స్థానంలో ఉండేలా చేసేందుకు డివిజన్ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఏడీఆర్ఎంలు శ్రీనివాస్, సైమన్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ జట్టుకు కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థి పి.నరేంద్ర ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వి.నాగిరెడ్డి గురువారం తెలిపారు. ఖాజీపాలెంలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ 10కే, 20కే పోటీలలో నరేంద్ర 10కే పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి పతకం సాధించి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. మహారాష్ట్రలో త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. నరేంద్రను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వెంకటశివ, పీడీ ఎం.వినీల్ అభినందించారని తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట రూరల్: ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను గత నెల 30, 31 తేదీలలో వర్సిటీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. జట్టులోని క్రీడాకారులు గొట్టం లక్ష్మీ స్నేహలత, బొజ్జ యమున, దనిరెడ్డి రాణిలు ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. వీరిని కళాశాల చైర్మన్ శేషగిరిరావు, ప్రిన్సిపల్ ఎం.ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ జాజుల శంకర్, అధ్యాపకులు అభినందించారు.

మాట తప్పని సీఎం వైఎస్ జగన్

మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: కష్టాలు ఎదురొచ్చినా, ఆర్థిక ఒడిదుడుకులు వచ్చినా మహిళలకు మాట ఇచ్చి నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గో విడత పంపిణీ కార్యక్రమం మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా నాల్గో విడతలో 1055 గ్రూపులకు చెందిన 10,578 మంది మహిళలకు రూ. 33.99 కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. 45 ఏళ్ల పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలు 3178 మందికి వైఎస్సార్ చేయూత ద్వారా రూ. 23.14 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. బ్యాంకుల ద్వారా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున 772 మందికి జగనన్న తోడు పథకం ద్వారా రూ. 7.70 కోట్లను ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డి పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు రూ.3.10 కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా 1458 గ్రూపుల్లో 14589 మంది మహిళలకు రూ.347.70 కోట్లు, స్త్రీ నిధి ద్వారా రూ.13.94 కోట్లు, ఉన్నతి ద్వారా రూ. 95 లక్షలు కలిపి మొత్తం నకరికల్లు మండలానికి రూ.730.52 కోట్లు లబ్ధి చేకూరిందని మంత్రి వివరించారు. మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ చరిత్ర సృష్టించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మాట తప్పిన చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ కట్టకట్టుకుని వచ్చినా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, అంబటి రాంబాబును ఓడించలేరని ధీమా వ్యక్తం చేశారు. మాట తప్పే నైజం చంద్రబాబుదని, ఇది ప్రతి ఒక్కరికీ తెలుసు అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజక నాయకులు పక్కాల సూరిబాబు, డ్వాక్రా పీడీ బాలునాయక్, ఏపీఎం సునీత, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మేచారపు అనురాధ, సర్పంచ్ పరస అంజమ్మ, వైస్ ఎంపీపీలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కలెక్టరేట్‌లో ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

- ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి
- కలెక్టర్ ఎల్.శివశంకర్
- రూ.3కోట్లతో నిర్మాణం

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ సేవల్ని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, పౌరులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో నడిచేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. డీఆర్వో కె.వినాయకం పూజల అనంతరం గురువారం రూ.3కోట్ల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రెవెన్యూ ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ప్రారంభించారు. కలెక్టర్ డబ్బులు చెల్లించి తన కారుకు ఆయిల్ కొట్టించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పెట్రోలు బంకు ద్వారా నెలకు రూ.80వేలు వంతున లీజు వస్తుందని, రూ. 6లక్షలు పైన ఆదాయం లభించే విధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖర్చులకు, మౌలిక వసతులు ఏర్పాటుకు, ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు బడ్జెట్‌పై ఆధారపడకుండా ఆత్మస్థైర్యంతో నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. సాధారణంగా కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయం పరిధిలో పెట్రోల్ బంకులు ఉంటాయని, అయితే తాను సీతంపేటలో పనిచేసేటప్పుడు అక్కడ ఐటీడీఏ తరఫున ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుచేసి నిధులు సమకూర్చినట్లు వెల్లడించారు. నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ప్రతిపాదన పంపించి 32 ఎకరాలు మంజూరు చేయించామని తెలిపారు. ఈ స్థలంలో రెవెన్యూ సొసైటీ సాయంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిబ్బంది నియామకంతో పాటు పూర్తి నియంత్రణ బాధ్యత జిల్లా రెవెన్యూ అధికారి వారి వద్ద ఉంటాయని పేర్కొన్నారు. మాచర్ల, శావల్యాపురంలో కూడా పెట్రోల్ బంకులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్వయంగా నిధులు సమకూర్చుకునే విధంగా స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో షాపులు ఏర్పాటుకు రెవెన్యూ సొసైటీ తరఫున చర్యలు తీసుకున్నామని, షాపుల అద్దెలతో రెవెన్యూ పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటులో జిల్లా రెవెన్యూ అధికారి కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు శ్రీరామ్, అనిల్ కుమార్, లింగంగుంట్ల మాజీ సర్పంచు పొన్నపాటి ఈశ్వరరెడి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- గుంటూరు ఐజీ పాలరాజు
- జిల్లా ఎస్పీతో కలసి వినుకొండ రూరల్ పోలీసు స్టేషన్ తనిఖీ

వినుకొండ(నూజెండ్ల): శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బంది కృషి చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వినుకొండ రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో కలసి తనిఖీ చేశారు. స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు పరిశీలించారు. నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో రికవరీలు చేయాలని, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చేరువకావాలని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో మహిళా పోలీసులు భాగస్వాములు కావాలని సూచించారు. విచారణ దశలో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తెలుసుకొని, వాటి విచారణ వేగవంతం చేసేందుకు సూచనలు చేశారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసులు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, అసాంఘిక కార్యక్రమాలపై అప్రమత్తంగా వ్యవహరించి రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. మద్యం, ఇసుక గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ, మహిళలపై నేరాలను వార్డు సచివాలయ పోలీసుల సహకారంతో అరికట్టడటమే కాకుండా సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలపై ప్రజలకు అవగాహన కల్గించాలని తెలిపారు. పోలీసుల యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ అడ్మిన్ ఆర్. రాఘవేంద్ర, డీఎస్పీ కె.వి. మహేష్, రూరల్ సీఐ సుధాకర్, రూరల్ ఎస్‌ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, చెన్నకేశవులు, ఫిరోజ్ పాల్గొన్నారు.



రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఐజీ, ఎస్పీ

షూటింగ్‌బాల్ పోటీల్లో మెరిసిన విద్యార్థినులు

నాదెండ్ల: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ నేషనల్ చాంపియన్ షిప్‌లో ఏపీ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. చీరాలలో జరిగిన పోటీల్లో ఏపీ అండర్-17 బాలికల జట్టులో చిరుమామిళ్ల రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాపట్ల మైథిలి, మైదవోలు అలేఖ్య, దావల క్రాంతి జట్టులో సత్తా చాటారు. ముగ్గురు క్రీడాకారులు గొరిజవోలుకు చెందినవారు కావడం విశేషం. ఆడుదాం ఆంధ్రాలో పోటీల్లో భాగంగా క్రికెట్ ఉమెన్స్ విభాగంలో చిలకలూరిపేట నియోజకవర్గ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నరసరావుపేటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంది. చిలకలూరిపేట నియోజకవర్గ ఆడుదాం ఆంధ్రా కన్వీనర్ నాగరాజు, పీఈటీలు అభినందించారు.



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

మహిళా సాధికారత,ఆర్థికాభివృద్ధికి పెద్దపీట



సభకు పెద్ద సంఖ్యలో హాజరైన డ్వాక్రా మహిళలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీఆర్కే, డ్వాక్రా మహిళలు

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- సభకు భారీస్థాయిలో హాజరైన మహిళలు

మాచర్ల: దేశంలో మహిళా సాధికారతకు కృషి చేస్తున్న చేస్తున్న ఏకైక సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడానికి వేల కోట్ల రూపాయలు కేటాయించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని తెలిపారు. మానుకొండ కల్యాణ మండలంలో గురువారం జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నవరత్నాలలో భాగంగా నాలుగో విడత చెక్కును మహిళలకు అందించారు. అనంతరం మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో మేనేజర్ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా రూ. 2.50లక్షల కోట్లకు పైగా అందించిన ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. కరోనా కాలంలోనూ పేద కుటుంబాలను ఆదుకున్నారని చెప్పారు. పట్టణంలో 5,600 మందికి రూ. 3వేల చొప్పున పింఛన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మెప్మా ప్రాజెక్టు ద్వారా 4వ విడత 684 సంఘాలకు రూ. 7,86,15,318 రుణమాఫీ జరిగినట్లు చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని, బ్యాంకులలో ఉన్న బంగారాన్ని ఇంటికి తెస్తానని ఊదరకొట్టి ఆ తరువాత అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలను మోసం చేశారని పీఆర్కే విమర్శించారు. అందుకు భిన్నంగా సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు న్యాయం చేశారని తెలిపారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. మరొక్కసారి జగనన్నకు జేజేలు కొట్టి, ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. జగన్ సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ , బీసీలకు 50శాతం రాజకీయంగా పదవులిచ్చారని గుర్తు చేశారు. నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా పి. అనిల్‌కుమార్ యాదవ్‌ని నియమించి బీసీ అభ్యర్థిని ప్రోత్సహించినట్లు తెలిపారు. సభకు భారీగా హాజరైన ప్రతి మహిళకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కార్పొరేషన్ డైరెక్టర్లు బూదాల మరియమ్మ, ఉప్పలపాటి జాని, కామన బోయిన కోటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మెప్మా ప్రాజెక్టు సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు. తొలుత వేదిక వద్దకు వచ్చిన పీఆర్కేకు డ్వాక్రా సంఘాల సభ్యులు హారతులిచ్చి, పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పీఆర్కే, డ్వాక్రా సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ప్రభుత్వ విప్ ఆర్కే చిత్రపటానికి డ్వాక్రా సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. పీఆర్కే, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, ప్రజాప్రతినిధులను సత్కరించారు. ఐదు వేల మందికి పీఆర్కే ఆత్మీయ విందును అందించారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జానపాడులో రుణమాఫీ చెక్కును పంపిణీ చేస్తున ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిదేనని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పందిటివారిపాలెం, జానపాడు, గుత్తికొండ, జూలకల్లు గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందు చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణమాఫీ సంపూర్ణంగా చేస్తానని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా చేయలేదని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు నాలుగు దఫాలుగా అక్కాచెల్లెమ్మలకు డ్వాక్రా రుణ మాఫీ చేశారని తెలిపారు. అబద్ధపు హామీలిచ్చి ప్రజల్ని మోసం చేసింది కాకుండా, సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరుతుంటే సోంబేరులు అవుతారని నేడు చంద్రబాబునాయుడు విమర్శిస్తున్నారన్నారు. రెండు ఎకరాల భూమి కలిగిన ఆయన ఇప్పుడు లక్షల కోట్లు సంపాదించి కొడుకు లోకేష్‌కు అప్పగిస్తే ఆయన సోంబేరు కాడా? అని మహేష్‌రెడ్డి ప్రశ్నించారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇచ్చే సీఎం జగన్‌మోహన్ రెడ్డి కావాలో, అబద్ధపు హామీలిచ్చే చంద్రబాబు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. జానపాడులో 143 గ్రూపులకు చెందిన 1443 మంది సభ్యులకు నాలుగో విడతలో రూ. 68,46,911, పందిటివారిపాలెంలో 16 గ్రూపులలో 160 మంది సభ్యులకు రూ. 44, 87,834 , గుత్తికొండలో 122 గ్రూపులలో 1234 సభ్యులకు రూ. 60,89,474 , జూలకల్లులో 81 గ్రూపులు ఉండగా 821 మంది సభ్యులకు రూ. 37, 95,401 రుణమాఫీ అయినట్లు ఆయన వివరించారు. అనంతరం చెక్కులను డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రునిరామిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు సాతులూరి బాబు, గార్లపాటి అనసూర్య, వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు పూర్ణయ్య, తాళ్లపోగుల మర్యాదరావు, ఇనుముక్కల పాపులమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు మన్నెం శ్రీను, కోటేశ్వరరావు, చిన్నబోతుల శ్రీనివాసరావు, ఎల్. రాణి రాంబాబు, నల్లబోలు రాజేశ్వరి, వెంకటేశ్వర్లు, మొగిలి అన్నపూర్ణమ్మ, వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యులు మస్తాన్‌వలి, బుడే, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ఉన్నం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం నరసింహారావు, కొతారు నరసింహారావు, మోర్జంపాడు కాశీం, లక్ష్మయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నల్లబోలు రామారావు, బండ్ల రామారావు, కావూరి రామాంజనేయులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారికేళ్ల సాంబశివరావు, నల్లబోలు రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల అరెస్టు
- 107.845 కేజీల గంజాయి, రెండు బైకులు స్వాధీనం
- మరో ముగ్గురి కోసం గాలింపు
- సమావేశంలో చిలకలూరిపేట రూరల్ సీఐ పి. శ్రీనివాసరెడ్డి

చిలకలూరిపేట/యడ్లపాడు: బైకులపై భారీగా గంజాయిని హైవే మీదుగా తరలిస్తున్న ఇద్దరి నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం హైవే జంక్షన్‌లో పట్టుబడ్డ వీరి నుంచి రూ.10 లక్షల విలువైన 107.845 కేజీల గంజాయి, తరలింపునకు ఉపయోగించిన రూ.11లక్షల విలువైన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీసు కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ పి. శ్రీనివాసరెడ్డి వివరాలను వెల్లడించారు. కొన్ని చెక్‌పోస్టుల వద్ద వాహనాలు ఆపకుండా వస్తున్నాయనే సమాచారంతో యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని హైవే జంక్షన్ వద్ద బుధవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. యడ్లపాడు ఎస్‌ఐ ఇతర విధుల్లో ఉన్నందున ఆ బాధ్యతను నాదెండ్ల ఎస్‌ఐ బలరామ్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు బైకులపై బ్యాగులతో వస్తున్న ఇద్దరిని ఆపే ప్రయత్నం చేయగా, పారిపోయే క్రమంలో వారి వాహనాలు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. వారిని పట్టుకుని బ్యాగుల్ని తనిఖీ చేయగా గంజాయి దొరికింది. నిందితులిద్దరిని విచారించగా ఒకరు హైదరాబాద్ పురానపూల్ వాసి చింతలపుట్టి శివకుమార్, మరొకరు ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండబ్లాక్ గొంటవాడ పంచాయతీలోని గులాబిగూడ గ్రామస్తుడు కిముడు శంకర్ అని తెలిసింది. అయితే, శంకర్ ప్రస్తుతం విశాఖపట్నంజిల్లా దుప్పలవాడ మండలం అప్పర్ సీలేరు చింతపల్లి క్యాంప్ వద్ద నివసిస్తున్నాడు. పట్టుబడ్డ ఇద్దరితో పాటు మరో ముగ్గురు ఒరిస్సా సరిహద్దు ప్రాంతం మల్కనగిరిలో గంజాయిని కొనుగోలు చేసి రాత్రి 10 గంటలకు బైక్‌లపై హైదరాబాద్‌కు బయలుదేరారు. అంతా విజయవాడ వరకు కలిసే రాగా, రూటు తప్పి వీరు చిలకలూరిపేట వైపు మళ్లారు. దీంతో పోలీసులకు చిక్కినట్లు సీఐ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నామని, మిగిలిన వారిని కూడా అదుపులోకి తీసుకునేందుకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. కేసును పూర్తిస్థాయిలో ఛేదించి త్వరలోనే మిగిలిన వారిని కూడా పట్టుకుంటామని చెప్పారు.

గతంలోనూ కేసులు...

ప్రధాన నిందితుడైన హైదరాబాద్‌కు చెందిన చింతలపుట్టి శివకుమార్‌పై గతంలోనూ కేసులు ఉన్నాయి. భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తుండగా సూర్యాపేట వద్ద పోలీసులు పట్టుకుని అరెస్టు చేయగా కోర్టు ఆర్నెల్లు జైలు విధించింది. శిక్ష అనుభవించి నాలుగు నెలల కిందట విడుదలై తిరిగి గంజాయి అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడని వివరించారు. వీరు హైదరాబాద్‌లోని బస్తీల్లో, కళాశాలల్లో గంజాయిని చిన్నచిన్న పొట్లాలు చేసి ఎక్కువ డబ్బులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్‌ఐలు జె. శామ్యూల్ రాజీవ్ కుమార్, వి. బాలకృష్ణ, జి. రవికృష్ణ, ఏఎస్‌ఐలు శ్రీనివాసరావు, రోశిబాబు, ఎన్. కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు తెలుపుతున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐలు శామ్యూల్ రాజీవ్‌కుమార్

ఆరుగురు నిందితులకు రిమాండ్

మార్టూరు: విధి నిర్వహణలో అధికారులను అడ్డుకుని వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసిన ఎనిమిది మందిలో ఆరుగురు నిందితులకు అద్దంకి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. బందోబస్తు మధ్య బుధవారం ఉదయం నిందితులను అద్దంకి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. అర్ధరాత్రి 1:00 గంట ప్రాంతంలో కేసును పరిశీలించిన జడ్జి వారికి 14 రోజుల పాటు రిమాండు విధించగా, ఒంగోలు జైలుకు తరలించినట్లు తెలిపారు. గత మంగళవారం మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీ నిమిత్తం వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులను టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఆయన అనుచరులు అడ్డుకుని కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే.